క్లుప్తంగా

ఈకేవైసీ తప్పనిసరి



ఈకేవైసీ నమోదు ప్రక్రియను పరిశీలిస్తున్న సీఎస్‌డీటీ నాగలక్ష్మి

చీపురుపల్లి: రేషన్‌కార్డులు కలిగిన కుటుంబాల్లో ప్రతీ లబ్ధిదారుడు తప్పనిసరిగా ఈకేవైసీ చేయించుకోవాలని సీఎస్‌డీటీ నాగలక్ష్మి తెలిపారు. పట్టణంలోని రుంకానవీధిలో మంగళ వారం చేపట్టిన ఈకేవైసీ నమోదు ప్రక్రియను ఆమె పరిశీలించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ లబ్ధిదారులు ఈకేవైసీ చేయించుకునే విధంగా డీలర్లకు బాధ్యతలు అప్పగిం చామన్నారు. రేషన్ లబ్ధిదారులు రాష్ట్రంలో ఎక్కడ నివసిస్తున్నా వారు నివసించే ప్రాంతం లోనే ఈకేవైసీ చేసుకోవచ్చని, మీసేవా కేంద్రాల్లో సైతం చేసుకోవచ్చన్నారు. మార్చి 31 వరకు గడువు ఉందని, డీలర్లు ఇంటింటికీ వెళ్లి ఈకేవైసీ నమోదు చేస్తున్నారని, లబ్ధిదారులు సహకరించాలని కోరారు.

పీహెచ్‌సీలో నేత్రవైద్య శిబిరం



శిబిరంలో నేత్రపరీక్షలు చేస్తున్న ఆప్తాలమిస్టులు శాంతి, వెంకటరమణ

దత్తిరాజేరు: కె.కొత్తవలస ప్రాథమిక ఆరోగ్య కేంద్రం(పీహెచ్‌సీ)లో వైద్యాధికారి స్రవంతి ఆధ్వర్యంలో మంగళవారం నేత్ర వైద్యశిబిరం నిర్వహించారు. విశాఖపట్నానికి చెందిన శంకర్ ఫౌండేషన్ కంటి ఆస్పత్రి ఆప్తాలమిస్టులు ఎస్.శాంతి, వెంకటరమణ శిబిరం లో 83 మందికి నేత్ర పరీక్షలు చేశారు. వీరిలో 29 మందిని శస్త్ర చికిత్సలకు ఎంపిక చేశారు. శంకర్ ఫౌండేషన్ మేనేజర్ ఎల్. ఎల్.ఎస్.మూర్తి మాట్లాడుతూ శస్త్రచికిత్సలకు ఎంపికైన వారిని విశాఖపట్నంలోని తమ ఫౌండేషన్‌లో నడుస్తున్న కంటి ఆస్పత్రికి ప్రత్యేక వాహనంలో తరలించి ఉచితంగా ఆపరేషన్ చేయిస్తామని చెప్పారు. ఆపరేషన్ అనంతరం మళ్లీ ఇళ్లకు తమ ఆస్పత్రి వాహనంలోనే చేర్చుతా మని తెలిపారు.

చలివేంద్రం ప్రారంభం



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న తహసీల్దార్ ప్రసాదరావు

లక్కవరపుకోట: స్థానిక తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని తహసీల్దార్ ప్రసాదరావు మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్యాలయానికి వివిధ రకాల పనులపై వచ్చే ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రం ఏర్పాటు చేశామన్నారు. వేసవి ముగిసే వరకు చలివేంద్రాన్ని కార్యాలయ సిబ్బంది నిర్వహిస్తారని చెప్పారు. డిప్యూటీ తహసీల్దార్ టి.రమేష్, కార్యాలయ ఉద్యోగులు, పలు గ్రామాల సర్పంచ్‌లు, మాజీ సర్పంచ్‌లు పాల్గొన్నారు.

జాబ్‌మేళా రేపు

కొత్తవలస: బలిఘట్టాం గ్రామ సమీపంలోని ప్రగతి పాలిటెక్నిక్ కళాశాలలో గురువారం జాబ్ మేళా నిర్వహించనున్నట్లు ఆ కళాశాల డైరెక్టర్ వనుము శ్రీనివాసరావు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపా రు. వీల్స్ ఇండియా లిమిటెడ్ కంపెనీలో ఉద్యోగాలు కల్పించేందుకు నిర్వహిస్తున్న ఈ జాబ్ మేళాకు డిప్లొమాలో ఎల్రక్టికల్, మెకానికల్ కోర్సులు చేసిన వారు, ఐటీఐలో డీజిల్ మెకానిక్, ఎలక్ట్రీషియన్, ఫిట్టర్ కోర్సులు చేసిన వారు హాజరు కావచ్చని పేర్కొన్నారు. అలాగే ఆయా కోర్సుల్లో చివరి సంవత్స రం చదువుతున్న వారు కూడా అర్హులేనని తెలిపారు. ఆసక్తి గల వారు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో ఉదయం 8.30 గంటలకు కళాశాలలో హాజరు కావాలని సూచించారు.

క్షయపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న ఆరోగ్య సహాయకులు సత్యారావు

కొత్తవలస: అప్పన్నపాలెం గ్రామ సమీపంలోని ఓపీ జిందాల్ పాఠశాల విద్యార్థులకు క్షయ(టీబీ)వాధిపై వియ్యంపేట పీహెచ్‌సీ వైద్య సిబ్బంది మంగళవారం అవగాహన కల్పించారు. ఆరోగ్య సహాయకులు సత్యారావు మాట్లాడుతూ రెండు వారాలకు మించి దగ్గు, జ్వరం,బరువు తగ్గడం,ఆకలి మందగించడం, కఫం ద్వారా రక్తపు జీరలు పడటం వంటి లక్షణాలు ఉంటే అది టీబీ వ్యాధి కావచ్చన్నారు.టీబీ వ్యాధిగ్రస్తులు దగ్గినప్పుడు, తుమ్మినప్పుడు వచ్చే తుంపర్ల ద్వారా వ్యాధి ఇతరులకు సోకే అవకాశం ఉందన్నారు. 2025 చివరి నాటికి క్షయ రహిత భారతదేశ నిర్మాణమే లక్ష్యంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పని చేస్తున్నాయని చెప్పారు. పాఠశాల ప్రిన్సిపాల్ విశ్వనాథం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే సారూ... కాస్త ఇటు చూడండి

- మూడు మండలాల్లోని 13 గ్రామాల్లో తాగునీటి సమస్య
- ఇందిరమ్మ సుజలధార పథకం నుంచి వాటర్ ట్యాంక్‌లకు అందని నీరు
- గ్రామాల్లో ఉన్న బోర్ల నుంచి సైతం ట్యాంకులకు పూర్తిస్థాయిలో నీరు అందని వైనం



గొల్లలపాలెంలో వాటర్ ట్యాంక్



గొల్లలపాలెం గ్రామ వ్యూ

చీపురుపల్లి: వేసవి ఉష్ణోగ్రతలు ఊపందుకోవడంతో పాటు మార్చి మూడోవారంలోనే గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి ఇబ్బందులు కూడా మొదలయ్యాయి. అదేంటి.. వేస విలో పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా ముందుస్తు చర్యలు చేపట్టేందుకు పాలకులు, అధికారులు ఉన్నారు కదా అని అనుకోవచ్చు. పాలకులు, అధికారులు ఉన్నారు కానీ..సాధారణంగా వేస విలో ఏయే గ్రామాల్లో తాగునీటి సమస్య ఉత్పన్నమవుతుంది..?, ఎక్కడెక్కడ రక్షిత మంచినీటి పథకాల సామర్థ్యం చాలడం లేదు..?, తాగునీటి బోర్ల పరిస్థితి ఎలా ఉంది, తదితర అంశాలపై వేసవి ప్రారంభంలోనే పాలకులు అధికారులతో సమీక్షలు నిర్వహించాల్సి ఉంటుంది. అయితే చీపురుప ల్లి నియోజకవర్గంలో మాత్రం అందుకు భిన్నంగా పరిస్థితులు కనిపిస్తున్నాయి. సమీక్షలు సంగతి పక్కన పెడితే కనీసం ఎక్కడ సమస్య ఉందో తెలుసుకుని పరిష్కరించే విధంగా అధికార పార్టీలో ఏ ఒక్కరూ బాధ్యత తీసుకున్న సందర్భాలు కనిపించడం లేదనే చర్చ స్థానికంగా జరుగుతోంది. మార్చి మూడో వారంలోనే నియోజకవర్గంలోని చీపురుపల్లి, గరివిడి, మెరకముడిదాం మండలాల్లో దాదాపు 13 గ్రామాల్లో తాగునీటి సమస్య ఉత్పన్నమైనప్పటికీ పట్టించుకునే నాథులే లేరంటూ విమర్శలు వినిపిస్తున్నా యి. వేసవిలో ప్రజలకు తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా చూసుకోవాల్సిన పాలకులకే ఏమీ పట్టకపోతే.. అధికారుల్లో మాత్రం ఏం చలనం ఉంటుందనే వాదనలు వినిపిస్తున్నాయి.

సుజలధార నుంచి అరకొరగా నీరు

చీపురుపల్లి మండలంలోని కర్లాం, మోదుగులపేట, చింతలపేట, గొల్లలపాలెం, చొక్కరపాలెం గ్రామాలు, గరివిడి మండలంలోని కుమరాం, ఆవగూడెం, బాగువలస, మెరకముడిదాం మండలంలోని గొట్టపల్లి, చెల్లాపురం, పతివాడపేట, కిలారుపేట తదితర గ్రామాల్లో తాగునీటి సమస్యలు ప్రారంభమయ్యాయి. ఈ గ్రామాల్లో ఇందిరమ్మ సుజలధార పథకానికి సంబంధించిన వాటర్ ట్యాంకులు ఉన్నప్పటికీ వాటికి నీరు ఎక్కడం లేదు. ఆ గ్రామాల్లో ట్యాంకర్లకు ఇందిరమ్మ సుజలధార పథకం నుంచి సాధారణ రోజుల్లోనే అరకొరగా నీరు అందేది. ప్రస్తుతం వేసవి కావడంతో అస్సలు నీరు ఎక్కడం లేదని గ్రామస్తులు చెబుతున్నారు. స్థానికంగా ఉన్న బోర్ల నుంచి కూడా భూగర్భజలాలు పూర్తిస్థాయిలో అందడం లేదు. మార్చిలోనే ఇలా ఉంటే ముస్ముందు పరిస్థితి ఏంటోనని ఆయా గ్రామాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

ఇందిరమ్మ సుజలధార పథకం వచ్చింది ఇలా...

దివంగత మహానేత వైఎస్.రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు అప్పటి చీపురుపల్లి ఎమ్మెల్యే, రాష్ట్రమంత్రిగా ఉన్న బొత్స సత్యనారాయణ చొరవతో రూ.83 కోట్లతో ఇందిరమ్మ సుజలధార తాగునీటి పథకాన్ని నియోజకవర్గానికి తీసుకొచ్చారు. అందులో భాగంగానే శ్రీకాకుళం జిల్లాలోని సంకిలిలో గల నాగావళి నది నుంచి పైప్‌లైన్ల ద్వారా శ్రీకాకుళం జిల్లాలోని జి.సిగడాం తో పాటు రాజాం, రేగిడి మండలాల్లోని పలు గ్రామాలతో పాటు తాగునీటిని చీపురుపల్లి నియోజకవర్గానికి తీసుకొచ్చారు. చీపురుపల్లిలో అప్పటి నుంచి చీపురుపల్లి నియోజకవర్గంలోని చీపురుపల్లి, గరివిడి, మెరకముడిదాం మండలాల్లో 164 గ్రామాలకు తాగునీరు అందిస్తున్నారు.

తాగునీటి కష్టాలు మొదలయ్యాయి

మా గ్రామంలో తాగునీటి కష్టాలు మొదలయ్యాయి. ఇందిరమ్మ సుజలధార తాగునీటి పథకం ట్యాంకు ఉన్నప్పటికీ ఆ ట్యాంక్‌కు పైప్‌లైన్ నుంచి నీరు ఎక్కడం లేదు. వేసవిలో చాలా ఇబ్బందులు ఎదుర్కొనాల్సి వస్తోంది. ట్యాంకుల వద్ద ఉన్న బోర్ల నుంచి కూడా నీరు పూర్తి స్థాయిలో అందడం లేదు. ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయకపోతే అవస్థలు తప్పవు.

– గొర్లె రమణ, గొల్లలపాలెం, చీపురుపల్లి మండలం

చివరి గ్రామాలకు నీరు అందడం లేదు

ఇందిరమ్మ సుజలధార తాగునీటి పథకం ద్వారా మండలాల్లోని శివారులో ఉన్న పలు గ్రామాల్లో ట్యాంకులకు నీరు ఎక్కడం లేదు. అక్కడ ఇప్పటికే ఉన్న బోర్ల ద్వారా నీరు ఎక్కించే చర్యలు చేపడుతున్నాం. ఎంతో కాలంగా ఈ సమస్య ఉంది. అయినప్పటికీ అక్కడి ప్రజలకు తాగునీటి సమస్య లేకుండా చర్యలు చేపడతాం.

– యుగంధర్, ఏఈ, ఇందిరమ్మ సుజలధార తాగునీటి పథకం

తుప్పు పట్టి పోవాల్సిందేనా..?





కొత్తవలస పోలీస్ స్టేషన్ పరిధిలో వివిధ కేసుల్లో పోలీసులు సీజ్ చేసిన వాహనాలు తుప్పుపట్టి పాడైపోతున్నాయి. పదుల సంఖ్యలో ద్విచక్ర వాహనాలు, ఆటోలు,క్యాబ్‌లు, మినీ వ్యాన్‌లు, బొలేరోలు, కార్లు స్టేషన్ ఆవరణలో ఎండకు ఎండుతూ, వానకు తడుస్తూ మూలుగుతున్నా యి. స్టేషన్ వద్ద సరిపడా స్థలం లేకపోవడంతో కొన్ని వాహనాలను ఇతర ప్రదేశాల్లో ఉంచారు. ఈ వాహనాలకు సంబంధించిన కేసులు ఏళ్ల తరబడి పరిష్కారం కాకపోవడంతో పోలీస్ స్టేషన్ వద్ద మూలుగుతున్నాయి. కేసులు పరిష్కారం అయ్యే వరకు వాహనాలను సంబంధిత యజమానులకు అప్పగించేందుకు, లేదా వేలం వేసేందుకు అవకాశం లేదని పోలీసులు చెబుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి త్వరితగతిన కేసులను పరిష్కరించి, వాహనాల విడుదల, వేలం వేసేందుకు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు. – కొత్తవలస

ఇళ్ల స్థలాలు ఎప్పుడు ఇస్తారు..?



రైల్వే మూడో లైన్ నిర్మాణంలో భాగంగా ఇళ్లు కోల్పోయిన తమకు ప్రత్యామ్నాయంగా ప్రభుత్వం ఇళ్ల స్థలాలు ఎప్పుడు ఇస్తుందో చెప్పాలని పెదమానాపురం గ్రామానికి చెందిన నిర్వాసితులు తహసీల్దార్ విజయ భాస్కర్‌ను నిలదీశారు. దత్తిరాజేరు మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద నిర్వాసితులు సీపీఎం ఆధ్వర్యంలో మంగళవారం ధర్నా చేశారు. నిర్వాసితులు చిల్ల గోవింద్,బోర మహేష్, ఎం.రాము, సరోజిని, గౌరమ్మ, రాంబాబు,తదితరులు మాట్లాడుతూ ప్రభుత్వం ఒత్తిడి చేయడంతో రైల్వే లైన్ నిర్మాణం కోసం 30 కుటుంబాల వారమంతా ఇళ్లను వదులుకున్నామన్నారు.అయితే అప్పట్లో తమకు 100 రోజుల్లో వేరే చోట ఇళ్ల స్థలాలు ఇస్తామని, ప్రభుత్వమే ఇళ్లు నిర్మిస్తుందని తహసీల్దార్ చెప్పారని, గడువుదగ్గరపడుతోందని ఇంత వరకు అధికారులు ఆ ఊసే ఎత్తడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇచ్చినహామీ ప్రకారం ప్రభుత్వం స్థలం కొనుగోలు చేసి ఇళ్లు నిర్మించి ఇవ్వాలని, నష్టపరిహారం పెంచాలని, లేకుంటే భవిష్యత్‌లో పోరాటం ఉధృతం చేస్తామన్నారు.అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. సీపీఎం నాయకులు శ్రీనివాసనాయుడు, తదితరులు పాల్గొన్నారు. – దత్తిరాజేరు

విద్యుత్ చార్జీల పెంపును నిరసిస్తూ ఆందోళన



శృంగవరపుకోట: ఎస్.కోటలో ఆందోళన చేస్తున్న సీపీఎం నాయకులు



కొత్తవలస: ర్యాలీ చేస్తున్న సీపీఎం నాయకులు

శృంగవరపుకోట: విద్యుత్ చార్జీల పెంపును నిరసిస్తూ సీపీఎం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ ఎదుట సీపీఎం శ్రేణులు మంగళవారం ఆందోళన చేశాయి. సీపీఎం మండల కార్యదర్శి మద్దిల రమణ మాట్లాడుతూ కూటమి నాయకులు నాడు ప్రజలకు చెప్పిందొ కటి, నేడు చేసేదొకటిగా ఉందన్నారు. 2014 నుంచి వాడిన విద్యుత్‌కి ఇప్పుడు సర్దుబాటు చార్జీలు అంటూ ప్రజల నుంచి వసూళ్లు చేయడం సరికాదన్నారు. ఇళ్లలో బలవంతంగా స్మార్ట్ మీటర్లను బిగించి ప్రజల నుంచి సొమ్ము వసూలు చేస్తున్నారన్నాని మండిపడ్డారు. ఎస్సీ, ఎస్టీ కుటుంబాలకు 100 యూనిట్ల వరకూ ఉచిత విద్యుత్ ఇవ్వాల్సి ఉన్నా, 50 యూనిట్లు దాటితే ముక్కు పిండి వసూళ్లు చేస్తున్నారన్నారు. ప్రభుత్వం పెంచిన విద్యుత్ చార్జీల విషయంలో వెనక్కి వెళ్లకుంటే ప్రజాఉద్యమాలతో బుద్ధి చెబుతామన్నారు. కార్యక్రమంలో గమ్మి సన్యాసిరావు, తాడి చిన్నారావు, పాంగి నాగేశ్వరరావు, వంతల చిన్నారావు, శ్రీధర వంశి, డి.ఉమామహేష్, జి.అప్పారావు, శ్రీరాములు పాల్గొన్నారు.

కొత్తవలసలో..

కొత్తవలస: పెంచిన విద్యుత్ చార్జీలను తగ్గించాలని కోరుతూ మండల కేంద్రంలో సీపీఎం ఆధ్వర్యంలో మంగళవారం ధర్నా చేశారు. సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు గాడి అప్పారావు మాట్లాడుతూ తాము అధికారంలోకి వస్తే అయిదేళ్లు విద్యుత్ చార్జీలు పెంచబోమని చంద్రబాబుతో పాటు కూటమి నాయకులు అంతా చెప్పారని గుర్తు చేశారు. కూటమి నాయకులు ఎన్నికలకు ముందు ఒక మాట ఇప్పుడొక మాట మాట్లాడుతున్నారని మండిపడ్డారు. విద్యుత్ చార్జీలతో ప్రజలపై మోయలేని భారం వేస్తున్నారని విరుచుకుపడ్డారు. తక్షణం విద్యుత్ చార్జీలను తగ్గించాలని డిమాండ్ చేశారు. అనంతరం స్థానికులతో కలిసి ర్యాలీ చేశారు. మండల సీపీఎం నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా పైడితల్లి అమ్మవారి పండగ



బొండపల్లి: పైడితల్లి అమ్మవారికి పూజలు చేస్తున్న మాజీ ఎమ్మెల్యే అప్పలనరసయ్య, నాయకులు

బొండపల్లి: మండలంలోని రుద్రపాలెంలో గ్రామదేవత పైడితల్లి అమ్మవారి పండగను గ్రామస్తులు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా గ్రామ స్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు పసుపు, కుంకుమ, చీరలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.భక్తులకు ఇబ్బందులు కలగకుండా గ్రామపెద్దలు, నిర్వాహకులు తగిన ఏర్పాట్లు చేశారు. అమ్మవారిని గజపతినగరం మాజీ ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య, ఎంపీపీ చల్లా చలంనాయుడు దర్శించుకున్నారు. వైఎస్సార్‌సీపీ నాయకుడు పి.ఎస్.మూర్తి, స్థానిక నాయకులు, పెద్దలు పాల్గొన్నారు.

ముగిసిన సంతానలక్ష్మి అమ్మవారి జాతర



చీపురుపల్లి: సంతాన లక్ష్మి అమ్మవారిని దర్శించుకుంటున్న వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రచార విభాగం అధ్యక్షుడు శ్రీనివాసనాయుడు

చీపురుపల్లి: పట్టణంలోని మెయిన్‌రోడ్‌లో ఉన్న సంతానలక్ష్మి(శీతలమాత) అమ్మవారి ఆలయం వద్ద మూడురోజులుగా నిర్వ హించిన జాతర మహోత్సవాలు మంగళవారంతో ముగిశాయి. జాతర ముగింపు రోజు కావడంతో అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రచార విభాగం అధ్యక్షుడు వలిరెడ్డి శ్రీనివాసనాయుడు, బాలుర ఉన్నత పాఠశాల పీఎంసీ కమిటీ చైర్మన్ గవిడి సురేష్, రాష్ట్రీయ బ్రాహ్మణ సంఘటన రాష్ట్ర ఉపాధ్యక్షుడు భోగాపురపు వాయునందనశ ర్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. వైఎస్సార్‌సీపీ నాయకులు కర్రోతు ప్రసాద్, ఎల్.ప్రభాత్ తదితరులు పాల్గొన్నారు.

రీసర్వేతో భూసమస్యలకు పరిష్కారం




ర్యాలీ చేస్తున్న అధికారులు, సర్వే సిబ్బంది

గంట్యాడ: రీసర్వేతో రైతులు భూసమస్యలకు పరిష్కారం లభిస్తుందని డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వేయర్ వెంకటరావు అన్నారు. సిరిపురం గ్రామంలో రీసర్వే చేపట్టనున్న నేపథ్యంలో మంగళవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ భూసర్వే ను రైతులు సద్విని యోగం చేసుకోవాలని చెప్పారు. సర్వే సిబ్బందికి సహకరించాలని కోరారు. తహసీల్దార్ నీలకంటేశ్వరరెడ్డి, మండల సర్వే యర్ దాసరి సత్యం, రీసర్వే డిప్యూటీ తహసీల్దార్ నాగలక్ష్మి, ఆర్ఐ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఓటర్ల నమోదుకు సహకరించండి

శృంగవరపుకోట: అర్హులను ఓటర్లుగా నమోదు చేసేందుకు సహకరించాలని, ఓటర్ల జాబితాల్లో అభ్యంతరాలు ఉంటే తెలియజేయాలని రాజకీయ పార్టీల నాయకులను కేఆర్‌ఆర్‌సీ డిప్యూటీ కలెక్టర్, ఈఆర్ఓ మురళి కోరారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో రాజకీయ పార్టీల ప్రతినిధులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కొత్తగా ఓటర్ల నమోదుతో పాటు జాబితాలో తొలగింపులు, చనిపోయిన వాళ్లు, వలసలు వెళ్లిన వారి వివరాలను గమనించాలని, పూర్తి వివరాలు పరిశీలించి అభ్యంతరాలు ఉంటే రెవెన్యూ సిబ్బందికి చెప్పాలని సూచించారు. తహసీల్దార్ అరుణకుమారి, రెవెన్యూ ఉద్యోగులు పాల్గొన్నారు.



శృంగవరపుకోట: రాజకీయ పార్టీల నాయకులతో సమావేశమైన ఈఆర్ఓ మురళి

ఓటర్ల నమోదు నిత్య ప్రక్రియ

దత్తిరాజేరు: ఓటర్ల నమోదు నిత్యప్రక్రియ అని, 18 ఏళ్లు నిండిన వారందరినీ ఓటర్లుగా నమోదు చేయాలని గజపతి నగరం నియోజకవర్గ ఓటర్ల నమోదు అధికారి ప్రమీలా గాంధీ అన్నారు.స్థానిక మండల పరిషత్ కార్యాల యంలో బీఎల్‌ఓలతో మంగళవారం సమావేశమయ్యారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ చనిపోయిన వారిని, శాశ్వతంగా వలస వెళ్లిపోయిన వారిని ఓటర్ల జాబితా నుంచి తొలగించాలని సూచించారు. రెండు చోట్ల ఓటు ఉన్న వారిని గుర్తించి, వారు ఎక్కడ కోరుకుంటే అక్కడే ఓటు హక్కు ఉంచాలని చెప్పారు. తహసీల్దార్ విజయభాస్కర్ పాల్గొన్నారు.

లక్కిడాంలో అనధికార కుళాయిలు..!

- నోటీసులు ఇచ్చిన పంచాయతీ కార్యదర్శిపై దురుసుగా మాట్లాడిన కూటమినేత

గంట్యాడ: కూటమి నేతలు అధికారం దర్పాన్ని ప్రదర్శిస్తున్నారు. అధికారం ఉంది కదా తమను ఎవరూ ఏమి చేయలేరనే ధీమాతో ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. తమ ఆదేశాలు పాటించాల్సిందేనని అధికారులకు హుకుం జారీ చేస్తున్నారు. ఎవరైనా ప్రశ్నిస్తే వారిపై దురుసగా వ్యవహరిస్తున్నట్లు విమర్శలు వినిపిస్తున్నాయి. మండలంలోని లక్కిడాం గ్రామంలో కూటమి నేతలు అనధికారికంగా నాలుగు తాగునీటి కుళాయిలు ఏర్పాటు చేసుకున్నారు. వీటిపై గ్రామస్తులు పంచాయతీ కార్యదర్శి జుల్కనా బేగం దృష్టికి తీసుకువెళ్లారు. పంచాయతీ కార్యదర్శి పరిశీలించి, అనధికారిక కుళాయిలను తొలగించాలని నలుగురు వ్యక్తులకు నోటీసులు జారీ చేశారు. నోటీసులు అందుకున్న నలుగురిలో ఒక వ్యక్తి పంచాయతీ కార్యదర్శితో దురుసుగా ప్రవర్తించినట్లు తెలుస్తోంది. అధికార పార్టీకి చెందిన మాకే నోటీసులు ఇస్తావా, ఎంత ధైర్యం అంటూ పంచాయతీ కార్యదర్శిపై కేకలు వేయడంతో... పంచాయతీ కార్యదర్శి కుళాయిలు తొలగించే సాహసం చేయకుండా మిన్నుకుండి పోయారని సమాచారం.





లక్కిడాం లో అనధికారికంగా ఏర్పాటు చేసిన కుళాయిలు

ఈఓపీఆర్డీ దృష్టికి తీసుకువెళ్లాం

లక్కిడాం గ్రామంలో నాలుగు ఇళ్లకు అనధికారికంగా కుళాయిలు ఏర్పాటు చేసినట్లు తెలియడంతో నలుగురికి నోటీసులు ఇచ్చాం. ఓ వ్యక్తి దురుసుగా మాట్లాడారు. ఈవిషయాన్ని ఈఓపీఆర్డీ దృష్టికి తీసుకువెళ్లాను.

– జుల్కనా బేగం, పంచాయతీ కార్యదర్శి

సంక్షిప్తంగా...

23న మండల సర్వసభ్య సమావేశం

చీపురుపల్లిరూరల్(గరివిడి): ఈనెల 23న గరివిడి మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ ఎం.వి.బి.సుబ్రహ్మణ్యం మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. మండల పరిషత్ కార్యాలయ సమావేశ భవనంలో ఎంపీపీ మీసాల విజయలక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహించే సమావేశానికి అన్ని శాఖల అధికారులు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు హాజరుకావాలని కోరారు.

పాఠశాలల సందర్శన

వేపాడ: మండలంలో గుడివాడ ప్రాథమిక పాఠశాలను ఎంఈఓ నాగభూషణం, నీలకంఠపురం ప్రాథమిక పాఠశాలను ఎంఈఓ-2 బాలభాస్క రరావు మంగళవారం సందర్శించారు. ఆయా పాఠశాలల్లో రికార్డులు ,కిచెన్‌గార్డెన్‌లు, విద్యార్థుల వర్క్‌బుక్‌లను పరిశీలించారు. విద్యార్థులతో పాఠ్యాంశాలు చదివించారు. చదువులో వెనుకబడిన విద్యార్థులపై దృష్టి పెట్టాలని ఉపాధ్యా యులకు సూచించారు.

విద్యుత్ మోటారు చోరీ

దత్తిరాజేరు: కోమటిపల్లి ఆటో స్టాండ్ సమీపంలోని శ్రీహనుమత్‌గాయత్రీ కల్యాణ మండపంలో విద్యుత్ మోటారు చోరీకి గురైనట్లు మంగళవారం ఫిర్యాదు అందిందని పెదమానాపురం ఎస్ఐ జయంతి తెలిపారు. 16వ తేదీన రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు వైర్లు కత్తిరించి మోటారు దొంగిలించినట్లు కల్యాణ మండపం యజమాని కె. వెంకటనర్సింహులు ఫిర్యాదు చేశారు. దర్యాప్తు చేసి దొంగలను పట్టుకుంటామని ఎస్ఐ చెప్పారు.

గెడ్డ ఆక్రమణపై ఫిర్యాదు

చీపురుపల్లిరూరల్(గరివిడి): గరివిడి మండలంలోని బొడ్డపేటలో గెడ్డను గ్రామానికి చెందిన ముగ్గురు వ్యక్తులు ఆక్రమించే శారని ఆ గ్రామానికి చెందిన పిల్ల ఈశ్వరరావు, మరికొందరు తహసీల్దార్ సీహెచ్.బంగార్రాజుకు మంగళ వారం ఫిర్యాదు చేశారు. నీరు ప్రవహించే గెడ్డను మట్టితో కప్పి బోరు ఏర్పాటు చేసుకున్నారని, గెడ్డలో పెంటకుప్ప కూడా పెట్టారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఆక్రమణలను పరిశీలించి, తొలగించాలని తహసీల్దార్‌ను కోరారు.

ఇళ్ల పట్టాల కోసం ఆందోళన

లక్కవరపుకోట : రంగరాయపురం గ్రామానికి చెందిన 15 కుటుంబాలు వారు తమకు ఇళ్ల పట్టాలు ఇవ్వాలని కోరుతూ స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద సీపీఎం ఆధ్వర్యంలో మంగళవారం ఆందోళన చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ సుమారు 45 ఏళ్లుగా తాటాకుల పాకల్లో ఉంటున్నామని, పట్టాలు ఇచ్చి, ఇళ్లు మంజూరు చేయాలని కోరారు. తహసీల్దార్ ప్రసాదరావుకి వినతిపత్రం అందజేశారు.అలాగే విద్యుత్ చార్జీల పెంపుపై సీపీఎం నాయకులు గాడి అప్పారా వు,తరిణి వెంకటరమణ, తదితరులు నిరసన తెలిపారు.

సచివాలయాల్లో ఆధార్ కేంద్రాలు

మెరకముడిదాం: మండల కేంద్రంతో పాటు, గర్భాం,సాతాంవలస గ్రామ సచివాలయాల్లో ఈనెల 19వ తేదీ నుంచి 22 వరకు, తిరిగి 25 నుంచి 28వ తేదీ వరకు ప్రత్యేక ఆధార్ కేంద్రాలు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ జి.భాస్కరరావు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కేంద్రాల్లో బాల ఆధార్ నమోదు చేసుకోవచ్చని, 5 సంవత్సరాల నుంచి 15 సంవత్సరాల మధ్య పిల్లలు,16 నుంచి 18 సంవత్సరాల మధ్య యువతకు సంబంధించిన బయోమెట్రిక్ నమోదు, ఆధార్‌కు మొబైల్ నంబర్ లింక్ అప్‌డేట్, ఆధార్ కార్డులో చిరునామా మార్పులు, చేర్పులు వంటి సేవలు అందించనున్నట్లు పేర్కొన్నారు.

వీఓఏను కొనసాగించాలని తీర్మానం

మెరకముడిదాం: గొల్లవలస గ్రామ వీఓఏగా పనిచేస్తున్న మజ్జి రూపవతిని విధుల్లో కొనసాగించాలని ఆ గ్రామానికి చెందిన 20 డ్వాక్రా సంఘాల ప్రతి నిధులు తీర్మానం చేశా రు. తీర్మానం ప్రతిని సర్పంచ్ బూరాడ గో విండ్, ఉపస ర్పంచ్ మధు సమక్షంలో స్థానిక వెలుగు కార్యాలయంలో మండల సమాఖ్య అధ్యక్షురాలు టి.స్వాతికి వీఓఏ రూపవతి మంగళవారం అందజేశారు. అనంతరం విలేకరులతో సర్పంచ్ మాట్లాడుతూ వీఓఏ రూపవతి సక్రమంగా విధులు నిర్వహించడం లేదని, ఈనెల 15వ తేదీన మండల సమాఖ్య అధ్యక్షురాలు స్వాతి నోటీసు ఇచ్చారన్నారు. వీఓఏ విధులపై తమకు ఎలాంటి అసంతృప్తి లేదని గ్రామానికి చెందిన 20 సంఘాల సభ్యులు తీర్మానం చేశారని చెప్పారు. వీఓఏ విషయంలో అధికారులు ఎలాంటి వివక్ష చూపవద్దని కోరారు.

అక్రమంగా గ్రావెల్ తవ్వకాలు..!



రోడ్డు పనుల కోసం అక్రమంగా తవ్వి తీసుకువచ్చిన గ్రావెల్

లక్కవరపుకోట: మండలంలోని కొట్యాడ గ్రామ సమీపంలోని నరసింహసాగర్ చెరువులో అక్రమంగా గ్రావెల్ తవ్వకాలు యథేచ్ఛగా సాగుతున్నాయి. గ్రావెల్ రోడ్డు పనులు చేపడుతున్న వ్యక్తులు రోడ్డు కోసం ఎలాంటి అనుమతులు లేకుండా చెరువు మట్టిని తవ్వేస్తున్నారని రెవెన్యూ అధికారులకు గ్రామస్తులు మంగళవారం ఫిర్యాదు చేశారు. అక్రమ తవ్వకాల విషయాన్ని రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ సన్యాసిరావు వద్ద సాక్షి ప్రస్తావించగా.. గ్రావెల్ తవ్వకాలకు ఎలాంటి అనుమతులూ లేవని స్పష్టం చేశారు. గ్రావెల్ తవ్వకాలకు పాల్పడిన వ్యక్తులపై చర్యలు తీసుకుంటామని చెప్పారు.